రాళ్లతో రహదారి పనులు

- గ్రావెల్ పేరుతో గుత్తేదారు ఇష్టారాజ్యం
- ప్రభుత్వ భూమిలో అక్రమ తవ్వకాలు
- రెవెన్యూ, మైనింగ్ అధికారుల నిర్లక్ష్యం



రహదారి నిర్మాణంలో గ్రావెల్‌కు బదులుగా బండ రాళ్లను వినియోగిస్తున్న దృశ్యం

అశ్వారావుపేటరూరల్: సాధారణంగా గ్రావెల్, మట్టి, వెట్‌మిక్స్, కంకరతో రహదారులను నిర్మిస్తుంటారు. కానీ దీనికి పూర్తి భిన్నంగా ఓ కాంట్రాక్టర్ మాత్రం కోట్లాధి రూపాయాల వ్యయంతో నిర్మించే ఓ రహదారిని ఏకంగా రాళ్లతోనే నిర్మిస్తున్నాడు. అది కుడా ఓ ప్రభుత్వ భూమిలో ఏలాంటి అనుమతులు లేకుండానే భారీగా తవ్వకాలు చేసి తరలిస్తు. మైనింగ్, రెవెన్యూ శాఖ అధికారులకు కనీసం పట్టడం లేదు. వివరాలిలా ఉన్నాయి.

అశ్వారావుపేట మండలంలోని మద్దికొండ గ్రామం నుంచి నారంవారిగూడెం వరకు బీటీ రహదారి నిర్మాణానికి రూ.1.76కోట్లు ప్రభుత్వం రోడ్లు భవనాల శాఖ ద్వారా మంజూరు చేసింది. ఈ పనులను టెండర్ ప్రక్రియ ద్వారా ఖమ్మానికి చెందిన ఓ బడా కాంట్రాక్టర్ దక్కించుకోగా.. కొద్ది రోజుల క్రితమే రహదారి నిర్మాణ పనులు మొదలు పెట్టాడు. కాగా, ఈ బీటీ రహదారి నిర్మాణానికి ముందుగా గ్రావెల్ మట్టితో ప్యాకింగ్ చేయాల్సి ఉంది. కానీ సదరు కాంట్రాక్టర్ గ్రావెల్ మట్టికి బదులుగా జోగురు రాయిను ఏలాంటి అనుమతులు లేకుండానే సమీపంలోనే ఉన్న ప్రభుత్వ భూమి (రెవెన్యూ) నుంచి భారీ జేసీబీలతో తవ్వకాలు చేసి పదుల సంఖ్యలో ఏర్పాటు చేసుకున్న లారీ ట్రిప్పర్‌ల ద్వారా తరలిస్తున్నారు. గ్రావెల్‌కు బదులు పెద్ద పెద్ద రాళ్లతో రహదారి నిర్మాణాన్ని చేపట్టడంపై స్థానికులు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాళ్లతో నిర్మిస్తున్న రహదారి నిర్మాణ పనులను పర్యవేక్షించాల్సిన ఇంజనీర్లు కనీసం ఆ ఊసే ఎత్తడం లేదని స్థానికులు చెబుతున్నారు.

ప్రభుత్వ భూముల్లో భారీగా తవ్వకాలు

మద్దికొండ–నారంవారిగూడెం మధ్య నూతనంగా నిర్మిస్తున్న బీటీ రహదారి కోసం గ్రామ సమీపం లోగల ప్రభుత్వ భూమిలో ఈ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ రాత్రి, పగలు తేడా లేకుండా జేసీబీలతో భారీగా తవ్వకాలు జరుపుతున్నాడు. రహదారి నిర్మాణ టెండర్‌లో కేటాయించిన క్వారీ లేదా రెవిన్యూ, మైనింగ్ శాఖ అనుమతుల ద్వారా తవ్వకాలు చేయాల్సి ఉంది. గడిచిన ఐదు రోజులుగా వందలా ట్రిప్పులను రహదారి నిర్మాణం కోసం తవ్వకాలు చేసి తరలించగా, వీటి విలువ దాదాపు ఐదు లక్షలకుపైనే ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. కానీ నిబంధనలకు విరుద్ధంగా ఈ తవ్వకాలు చేస్తుండగా, కనీసం పట్టించుకునే నాథులే లేకుండా పోయారు. తవ్వకాలు చేస్తున్న కాంట్రాక్టర్ వద్ద నుంచి తవ్వకాలకు డీడీ రూపంలో రెవెన్యూ, మైనింగ్ శాఖ వసూలు చేయక పోవడంతో ప్రభుత్వ ఖజనాకు భారీగానే గండి పడింది. దీంతో కాంట్రాక్టర్‌కు లక్షలాధిరూపాయలు ఆదా చేసినందుకు ఆయా శాఖల అధికారులకు భారీగానే మాముళ్లు అందినట్లు ప్రచారం జరుగుతోంది. దీనిపై స్థానిక ఆర్‌అండ్‌బీ డీఈఈ శ్రీనివాస్, జిల్లా మైనింగ్ అధికారుల వివరణ కోసం 'సాక్షి' ప్రయత్నించగా స్పదించలేదు.

క్లుప్తంగా

ఆక్రమణను గుర్తించాలి

చర్ల: తిప్పాపురం గ్రామ పంచాయతీలోని రెవెన్యూ భూముల మధ్యలో ఉన్న దారులు ఆక్రమణకు గురవుతున్నాయని, రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి వాటి గుండా రాకపోకలు సాగేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు గ్రామస్తులు వినతిపత్రాన్ని అందజేశారు. తిప్పాపురం మాజీ సర్పంచ్ కన్నారావు నేతృత్వంలో రైతులు తహసీల్దార్ శ్రీనివాస్‌ను కలిసి సమస్యలను వివరించారు. అనంతరం వినతిపత్రాన్ని అందజేశారు.

పోలీసులకు వైద్యశిబిరం



వైద్యపరీక్షలు చేయించుకుంటున్న సీఐ సతీష్, పక్కన డీఎస్పీ రవీందర్‌రెడ్డి

మణుగూరుటౌన్: మణుగూరులోని డీవీ ఫంక్షన్ హాల్‌లో సబ్ డివిజన్ పోలీసులకు గురువారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎస్పీ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. కంటి, సాధారణ ఆర్థోపెడిక్, తదితర వైద్యులతో పోలీసులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి రక్తపరీక్షలు, ఈసీజీలు నిర్వహించినట్లు వివరించారు. కార్యక్రమంలో మణుగూరు సీఐ సతీష్‌కుమార్, ఏడూళ్లబయ్యారం సీఐ వెంకటేశ్వర్లు, అశ్వాపురం సీఐ అశోక్‌రెడ్డి, ఎస్ఐలు రాజ్‌కుమార్ మేడ ప్రసాద్, రంజిత్, వైద్యులు జయశ్రీ, శశిధర్, వీరశేఖర్, ల్యాబ్ టెక్నీషియన్ బండారు నర్సింహారావు, వెంకటప్పయ్యలు ఉన్నారు.

సీపీఎం పట్టణ కార్యదర్శిగా స్వామి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణ సీపీఎం కార్యదర్శిగా గడ్డం స్వామిని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన పట్టణ 8వ మహాసభలో కార్యదర్శితో పాటు మరో ఆరుగురు సభ్యులతో నూతన పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎనికైన కార్యదర్శి గడ్డం స్వామి మాట్లాడుతూ.. పట్టణంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని, ప్రజ సమస్యలను గుర్తించి ప్రజల సమీకరనణతో వాటి పరిష్కారానికి పోరాటాలు చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, ఏజే రమేష్, మచ్చ వెంకటేశ్వర్లు, ఎంబీ నర్సారెడ్డి, సున్నం గంగ, బండారు శరత్‌బాబు, ఎర్రంశెట్టి వెంకటరామారావు, పారిల్లి సంతోష్‌కుమార్, సీతాలక్ష్మి పాల్గొన్నారు.

కొనుగోళ్లు జరపాలి

బూర్గంపాడు: బూర్గంపాడులోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లు జరిపేలా చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకుడు డి.పున్నంచంద్ డిమాండ్ చేశారు. గురువారం బూర్గంపాడులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మార్కెటింగ్‌శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా గ్రామాల్లో లైసెన్స్‌లు లేని దళారులు తక్కువ ధరలకు రైతుల వద్ద పంటలను కొనుగోలు చేసి, రైతులకు నష్టం కలిగిస్తున్నారన్నారు. వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించేలా బూర్గంపాడు మార్కెట్ యార్డులో అన్నిరకాల పంటల ఉత్పత్తులను కొనుగోలు జరిపాలని, ఈ మేరకు జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమష్టి పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

చర్ల: సమష్టి పోరాటాల ద్వారానే వాడ బలిజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకోగలుగుతారని వాడ బలిజ సేవా సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు చింతూరి వెంకట్రావు అన్నారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం చర్లలోని సంత మార్కెట్ సముదాయం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో ముందుగా పతాకావిష్కరణ చేసి.. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా వాడ బలిజల సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తు పోరాటాలను సాగిస్తామన్నారు. సమావేశంలో వాడబలిజ సేవా సంఘం నాయకులు గొర్ల మధు, కొప్పుల రాంబాబు, ఎర్రావుల ప్రేమ్, పూజారి వెంకటేశ్వర్లు, సంకపాప గణపతి, ఎక్కిల రవికుమార్, చింతూరి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పించాలి

భద్రాచలంటౌన్: ప్రభుత్వ ప్రాథమిక ఆస్పత్రులను బలోపేతం చేసి రోగులకు కనీస సౌకర్యాలు కల్పించాలని పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కెచ్చల కల్పన అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం పీవైఎల్, పీఓడబ్ల్యూ రాష్ట్రవ్యాప్త ఉద్యమ పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రులతో ఖాళీగా ఉన్న వైద్యులు, నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల భర్తీ వెంటనే చేయాలన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల ఫీజుల దోపిడీని అరికట్టి, కార్పొరేట్ ఆస్పత్రుల్లో పీఆర్‌ఓ వ్యవస్థను అరికట్టాలని కోరారు. మునిగేల మహేశ్వరి, దాసరి సాయన్న, కుమారి, మైమదా, కృష్ణవేణి, షకీరా, శాంత, పిరుదోజి పాల్గొన్నారు.

ప్రత్యేక పాఠశాల సందర్శన



విద్యార్థులకు డ్రైఫ్రూట్స్ పంపిణీ చేస్తున్న మండల అధికారులు

మణుగూరురూరల్: మండలంలోని ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల పాఠశాలను మణుగూరు తహసీల్దార్ వి.రాఘవరెడ్డి, ఎంపీడీఓ టి.శ్రీనివాసరావు, ఎంపీఓ పల్నాటి వెంకటేశ్వరరావు గురువారం సందర్శించి పరిశీలించారు. అక్కడి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, విద్యాబోధన తీరును గురించి ఐఈఆర్‌పీని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు పౌష్టికాహారమైన డ్రైఫ్రూట్స్, డ్రైసీడ్స్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీఎం అహ్మదుల్లా, పాఠశాల నిర్వాహకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో దోపిడీని అరికట్టాలి



ప్రభుత్వ ఆస్పత్రిలో సమస్యలను తెలుసుకుంటున్న నాయకులు

గుండాల: ప్రభుత్వ, ఆస్పత్రులను బలోపేతం చేస్తూ, ప్రైవేటు కార్పొరేట్ ఆస్పత్రుల దోపిడీని అరికట్టాలని పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాంకుడోత్ అజయ్, తెలంగాణ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి చంద్ర అరుణ, పీఓడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు యదలపల్లి సావిత్రిలు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని స్థానిక ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, సరిపోను మందులు సరఫరా చేయాలని అన్నారు. ప్రైవేట్ కార్పొరేట్ హాస్పటల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. అనవసరమైన ఆపరేషన్లు, టెస్టులను ప్రభుత్వం నియంత్రించాలని కోరారు. కార్యక్రమంలో ప్రగతిశీల యువజన సంఘం ఇల్లందు డివిజన్ కార్యదర్శి సనప కుమార్, గుండాల మండల అధ్యక్ష, కార్యదర్శులు వూకే శ్రావణ్, పూనెం మంగయ్య, పీఓడబ్ల్యు జిల్లా నాయకురాలు కోరం ముత్తక్క, డివిజన్ నాయకురాలు బి.వెంకటక్క, మండల నాయకులు ధారావత్ మోహన్, పూనెం కృష్ణ, గట్టి సురేష్, కొమరం సమ్మయ్య, కల్తీ సుదర్శన్, వజ్జ ధర్మరాజు, తారావత్ సురేష్, సునావత్ శంకర్ రాములు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వారోత్సవాలు



గ్రంథాలయంలో పుస్తకాలను పరిశీలిస్తున్న విద్యార్థినులు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని పెదవాగు ప్రాజెక్టు గ్రామంలోని గురుకుల డిగ్రీ మహిళా కళాశాలలో ఈ నెల 14వ తేదీ నుంచి నిర్వహిస్తున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ముగిశాయి. ముగింపు సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ స్పందన ఆధ్వర్యంలో విద్యార్థినులకు గ్రంథాలయ వారోత్సవాల విశిష్టత గురించి అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి పుస్తక పఠనం చేయాలని, తర్వాత ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సింధుశ్రీ, లైబ్రేరియన్ ఎం.అరుణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పోరాడితేనే ఇళ్లు ఇస్తారా?

అశ్వారావుపేటరూరల్: ఇంటి స్థలాల కోసం పేదలు, గిరిజనులు పోరాటాలు చేసే పరిస్థితి రావడం దురదృష్టకరమని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్–ప్రజాపంథా కేంద్ర కమిటీ సభ్యుడు కెచ్చెల రంగారెడ్డి అన్నారు. గురువారం అశ్వారావుపేట మండలం వినాయకపురం సమీపంలోగల ఎర్రగుంటపల్లి గ్రామంలో ఇంటి స్థలాల కోసం పోరాటం చేస్తున్న ఆదివాసీలకు ఆయన సంఘీభావం తెలిపి, పేదలకు పార్టీ నుంచి సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పాల్వంచ డివిజన్ కార్యదర్శి గోగినపల్లి ప్రభాకర్, నాయకులు కుంజా అర్జున్, పండా ముత్యాలు పాల్గొన్నారు.

అందని మిషన్ భగీరథ నీరు



వేములూరు–మనుబోతులగూడెం గ్రామాల మధ్య పగిలిన పైప్‌లైన్

అశ్వాపురం: మండల పరిధిలోని మారుమూల గిరిజన గ్రామమైన మనుబోతులగూడెం గ్రామంలో నెల రోజులుగా మిషన్‌భగీరథ తాగునీరు అందడం లేదు. వేములూరు నుంచి మనుబోతులగూడెం వెళ్లే మిషన్‌భగీరథ ప్రధాన పైపులైన్ పగలడంతో గ్రామానికి తాగునీరు అందడం లేదు. పైప్‌లైన్ పగలగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కిషోర్ పరిశీలించి మరమ్మతులు చేయించారు. మరల పైప్‌లైన్ 15 రోజుల క్రితం పగలడంతో మనుబోతులగూడెం గ్రామానికి నీరు రావడం లేదు. గ్రామ పంచాయతీ బోరు, మోటరు ద్వారా నీరు అందిస్తున్నారు. మిషన్‌భగీరథ అధికారులు స్పందించి పైప్‌లైన్ మరమ్మతులు చేయించాలని గిరిజనులు కోరుతున్నారు. డీఈ మహేందర్‌రెడ్డిని వివరణగా కోరగా రెండు రోజుల్లో పైప్‌లైన్ మరమ్మతులు చేసి తాగు నీరు అందిస్తామన్నారు.

నేడు ఆయుర్వేద వైద్యశిబిరం

మణుగూరుటౌన్: హైదరాబాద్‌కు చెందిన మాత రీసర్చ్ ఆఫ్ ఆయుర్వేద వైద్యాలయానికి చెందిన వైద్యులచేత నిర్వహించబోయే ఆయుర్వేద వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏరియా అధికార ప్రతినిధి సలగల రమేశ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పీవీకాలనీలోని సీఈఆర్ క్లబ్‌లో నిర్వహించే శిబిరం ఉదయం 10గంటల నుంచి వైద్యుడు విశ్వనాథ మహర్షి సాయంత్రం 6గంటల వరకు అనేక రకాల వ్యాధులకు పరీక్షలు చేస్తారని, మందులు అందజేస్తారని తెలిపారు.

రేపు ఇసుక వేలంపాట

ములకలపల్లి: ముత్యాంలపాడు శివారులో నూతనంగా నిర్మిస్తున్న వంతెన సమీపంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో సీజ్ చేసిన ఇసుక రాశుల విక్రయానికి వేలంపాట నిర్వహించనున్నట్లు తహసీల్దార్ గుడ్ల పుల్లారావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రేపు (శనివారం) ఉదయం 11 గంటలకు 15 ట్రాక్టర్ల ఇసుక వేలం వేస్తామని తెలిపారు. ఆసక్తిగల వారు వేలంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

24న నవోదయ మోడల్ పరీక్ష

బూర్గంపాడు: ఈ నెల 24వ తేదీన నవోదయ మోడల్ పరీక్ష నిర్వహించనున్నట్లు సారపాక బ్రిలియంట్ స్కూల్ కరస్పాండెంట్ బి.నాగేశ్వరరావు తెలిపారు. గురువారం విడుదల చేసిన ప్రకటనలో నవోదయ పరీక్షలు రాసే విద్యార్థులు ఈ మోడల్ పరీక్షలో పాల్గొంటే మంచి అవగాహన ఏర్పడుతుందన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఒకరోజు ముందుగా 9866283566, 7675040619 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఏఎస్ఐ సత్యనారాయణ బదిలీ

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం పోలీస్ స్టేషన్‌లో సుమారుగా ఆరు సంవత్సరాలపాటు హెడ్ కానిస్టేబుల్‌గా.. ప్రస్తుతం ఏఎస్ఐగా పనిచేసిన దుమ్ముగూడెం సత్యనారాయణ భద్రాచలం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. కాగా శుక్రవారం స్టేషన్‌లో సీఐ అశోక్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఎస్ఐ గణేష్, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట పరిశీలన

మణుగూరురూరల్: మున్సిపాలిటీ పరిధిలోని అన్నారం గ్రామంలో రైతులు సాగుచేసిన మొక్కజొన్న పంటను మణుగూరు మండల వ్యవసాయ అధికారి రాహుల్‌రెడ్డి గురువారం సందర్శించి పరిశీలించారు. మొక్కజొన్న సాగులో పాటించాల్సిన జాగ్రత్తలను, సస్యరక్షణ చర్యలను రైతులకు సూచించారు. ఏఈఓ కొమరం లక్ష్మణ్‌రావు, రైతులు మేడ నాగేశ్వరరావు, కురవి నరసయ్య పాల్గొన్నారు.

నాగబంధ ప్రతిష్ఠ

చర్ల: మండలంలోని సత్యనారాయణపురంలోని అభయాంజనేయస్వామి వారి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన నాగబంధ ప్రతిష్ఠాపన గురువారం వైభవంగా సాగింది. కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, టీపీసీసీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నల్లపు దుర్గాప్రసాదరావు కుటుంబ సభ్యుల నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి.. వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

జిల్లా స్థాయి సైన్స్ ఫేర్‌లో ప్రతిభ



అశ్వారావుపేటరూరల్: విద్యార్థిని సన్మానిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

దుమ్ముగూడెం: మండలంలోని నారాయణరావుపేట బాలుర ఆశ్రమ పాఠశాల 9వ తరగతి విద్యార్థి కంగాల రాకేష్‌వర్ధన్ జిల్లా స్థాయి సైన్స్‌ఫేర్‌లో మొదటి స్థానం సాధించాడు. అన్నపురెడ్డిపల్లిలో జరిగిన సైన్స్ ఫేర్‌లో 'సైన్స్–టెక్నాలజీ ఫర్ సస్‌స్టేయిన్‌బుల్ ఫ్యూచర్' అనే అంశంపై జిల్లా స్థాయి ఐటీడీఏ ఆశ్రమ పాఠశాలల నుంచి మొదటి బహుమతి గెలుపొందాడు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కుంజా శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు సర్వేశ్వరావు, నాగభూషణం, కోటేశ్వరరావు, బాలాజీ, గైడ్ ఉపాధ్యాయులు సురేష్, రవి, కల్యాణి, డిప్యూటీ వార్డెన్ మల్లం వెంకటేష్, సుభద్ర, శ్యాం, హరిలాల్, కృష్ణ వెంకటేష్ తదితరులు విద్యార్థిని అభినందించారు.

అశ్వారావుపేటరూరల్: జిల్లా స్థాయి వైజ్ఞానిక సదస్సులో అశ్వారావుపేట పాఠశాలకు చెందిన విద్యార్థి నాగ సాయి కౌశిక్ రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికయ్యాడు. విద్యార్థిని సన్మానించి, జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రసాద్‌రావు, హెచ్‌ఎం హరిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎక్స్‌లెంట్ విద్యార్థులు..

మణుగూరురూరల్: ఇన్‌స్పైర్ అవార్డ్స్ మనక్ స్కీం –2024 జిల్లా స్థాయి పోటీలో పైలట్ కాలనీ ఎక్స్‌లెంట్ హైస్కూల్ విద్యార్థినులు సత్తా చాటి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ చేతుల మీదుగా బహుమతి, ప్రశంసా పత్రాలను అందుకున్నారు. గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎక్స్‌లెంట్ విద్యాసంస్థల చైర్మన్ ఎండి యూసఫ్ షరీఫ్ మాట్లాడుతూ.. తేదీల్లో అన్నపురెటడ్డిపల్లి టీజీఎస్‌డబ్ల్యూఆర్ పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలో తమ పాఠశాలకు చెందిన కె.ప్రియహర్షిణి దుర్గ, ఎండి.రిధా ప్రదర్శించిన టెంపరేచర్ కంట్రోల్డ్ బెడ్ కూలర్ నమూనాకు జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి లభించిందన్నారు. తద్వారా విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. అనంతరం జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థినులను, గైడ్ టీచర్స్ పి.వెంకట్, మేఘనలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఎక్స్‌లెంట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎండి.ఖాదర్, డైరెక్టర్ ఎండి.యాకుబ్ షరీఫ్, విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

విద్యార్థులు హక్కులను తెలుసుకోవాలి



వంటశాలను తనిఖీ చేస్తున్న న్యాయమూర్తి శివనాయక్, సీఐ సంజీవరావు

భద్రాచలంటౌన్: చదువుకునే ప్రతి విద్యార్థి తమ హక్కులను తెలుసుకుని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని భద్రాచలం ఫస్ట్‌క్లాస్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ శివనాయక్ అన్నారు. పట్టణంలోని సుభాస్‌నగర్ కాలనీలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వసతి గృహాన్ని ఆయన గురువారం సందర్శించారు. తాగు నీరు, భోజన శాల, వసతి గదులు, మెనూ ప్రకారం విద్యార్థులకు ఏర్పాటు చేస్తున్నారా లేదా అనే విషయాలను తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యార్థులకు ఎటువంటి సమస్యలను ఉన్న సంబంధిత అధికారులకు సూచించాలని పేర్కొన్నారు. ఇలానే ప్రతి నెలా వసతి గృహాల తనిఖీ నిర్వహిస్తానని, విద్యార్థులకు వసతులు కల్పించని సిబ్బందిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. న్యాయమూర్తి వెంట పట్టణ సీఐ సంజీవరావు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

గుండాల: ఎంతో భవిష్యత్ ఉన్న విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ.. చదువులు, క్రీడల్లో రాణించాలని గుండాల సీఐ రవీందర్, ఎస్సై రాజమౌళి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు ర్యాగింగ్, మద్యపానం, క్రమశిక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ర్యాగింగ్‌కు పాల్పడితే ఆ చట్టాలు చాలా కఠినంగా ఉంటాయని, గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాల వంటి వాటిని ఎవరైనా సేవించినా, విక్రయించినా తమకు సమాచారం అందించాలని అన్నారు. మైనర్ విద్యార్థులు వాహనాలు నడిపితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హెచ్‌ఎం పార్వతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాయి ఆలయంలో భక్తులకు అన్నదానం

మణుగూరురూరల్: మండలంలోని సాయినగర్‌లో ఉన్న శ్రీషిరిడి సాయిబాబా ఆలయంలో గురువారం సందర్భంగా సాయినాథుడికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. మణుగూరు పట్టణానికి చెందిన కాట్రగడ్డ రామారావు–విజయలక్ష్మి దంపతులు సాయినాథుడిని దర్శించుకుని పూజ కార్యక్రమాలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. దాతలను ఆలయకమిటీ సభ్యులు శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దోసపాటి నాగేశ్వరరావు, సీహెచ్ బాలకేశవరావు, అర్చకులు పవన్ కుమార్ వర్మ, గుమస్తా వెంకన్న, సాయి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

చెకుముకి టాలెంట్ టెస్ట్

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టులు ఆయా మండలాల్లోని పాఠశాలల్లో గురువారం నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు, గురుకుల పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొని పరీక్ష రాశారు. కార్యక్రమానికి అతిథులుగా తహసీల్దార్, ఎంఈఓలు పాల్గొని పరీక్ష పోస్టర్లు ఆవిష్కరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ప్రశంసా పత్రాలను అందుకున్న విద్యార్థులు జిల్లా స్థాయిలో నిర్వహించే పోటీలకు హాజరవ్వనున్నారు. – సాక్షి నెట్‌వర్క్



మణుగూరురూరల్: చెకుముకి పరీక్ష రాస్తున్న విద్యార్థులు



భద్రాచలంటౌన్: విజేతకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు



కరకగూడెం: ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఎంఈఓ మంజుల



బూర్గంపాడు: ప్రశ్నపత్రాలు విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు, జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు



దమ్మపేట: విద్యార్థులకు పుస్తకాలను అందజేస్తున్న నిర్వాహకులు, ఉపాధ్యాయులు



దుమ్ముగూడెం: చెక్‌ముకి టెస్ట్‌లో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు



ములకలపల్లి: విజేతకు ప్రశంసాపత్రం అందజేస్తున్న దృశ్యం